**91**

**ధారావాహిక**



# జాయ సేనాపతి

**చారిత్రక కాల్పనిక నవల**

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** తన కాలానికి ‘వైష్ణవం - శైవం’ రెండూ రెండే అన్నంత సమ ఉజ్జీలుగా ఉండటం జాయపుణ్ని ఆహ్లాదపరచింది. కొండొకచో కొంత ఆనందపరచింది. ఆదిమ యుగాల కాలంలో అంతా ఉగ్రమే! ఉద్రేకాలు ఎక్కువ. కాబట్టి.. ఆ యుగపు ప్రజల తీరుకు అనుగుణమైన లక్షణాలున్న రుద్రుడు, పశుపతి, శర్వుడు, భీముడు, మహాదేవుడు.. వారి దేవతలు. చిత్రంగా ఆ ఆదిమజాతుల్లోనూ సాత్వికులు ఉండేవారు. వారి ప్రధానదేవుడు విష్ణువు. నలుగురికి మంచి చెప్పి, అంతూదరీ లేని సముద్రమనే మహాప్రపంచాన్ని మథించి.. పుట్టిన అమృతాన్ని అందరికీ పంచే ఈ విష్ణుమూర్తి ఎక్కువమందిని ఆకర్షించలేదు.

**కానీ** యుద్ధాల యుగాల్లో అడుగడుక్కీ రెచ్చిపోయి శూలం పుచ్చుకొని తిరిగే రుద్రుడు సాధారణ పౌరులకు గొప్ప ఆకర్షణ! ఆ ఆదిమకాలంలోనే కాదు.. ఈ కాలంలో కూడా కత్తులు పుచ్చుకొని తిరిగే దేవుళ్లపై మోహం ఎక్కువే కానీ, సాత్విక విష్ణువు ఆరాధన కూడా పెరుగుతున్నది.

విష్ణువుకు మిత్రదేవతలు ఇంద్రుడు, నారాయణుడు, సంకర్షణ, వాసుదేవుడు తదితరులున్నారు.

సమాజంలో రానురానూ జనాభా ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న కాలంలో ఈ సాత్విక దేవతల పట్ల భక్తులు కూడా పెరిగిపోసాగారు. బుద్ధుడు లాంటి గొప్ప ప్రవక్తల వల్ల గణం కోసం, సమాజం కోసం అమూర్త దేవతలకు చేసే యజ్ఞయాగాదులు తగ్గిపోయాయి. వాటి స్థానంలోనే దేవుళ్ల మానవరూపాలు వచ్చేశాయి. వారికి గుడులు కట్టి.. వాటిని పవిత్రస్థలాలుగా భావిస్తూ, సదరు దేవతలకు పూజా పునస్కార విధానాలు వచ్చాయి. అంశాలవారీ దేవుళ్లు.. అంటే చదువుకో దేవత, కళలకో దేవుడు, యుద్ధాలకో దేవుడు.. ఇలా బహు దేవతోపాసన వచ్చింది. వేరువేరు దేవుళ్లకు వేరు వేరు పూజా విధానాలు.. వ్రతాలు, ఉపవాసాలు, దానాలు, పుణ్యలోకగతులు.. అబ్బో బోలెడు!!

రుద్రుడల్లా శివుడయ్యాడు. అంటే ఉగ్రం కొంత తగ్గిందన్నమాట. పశుపతి, శర్వుడు తదితర పేర్లు ఇప్పుడు వినిపించడంలేదు. ఈ సాత్వికదేవుళ్లలో ఇంద్రుడు లాంటి యుద్ధ దేవతలంతా పోయారు. విష్ణుమూర్తి మాత్రం దశావతారాలతో అందరికీ ఆరాధ్యుడయ్యాడు.

అప్పుడు పెరిగిందండీ.. ఈ భక్తి అనే పదానికి ప్రాబల్యం. ఒక్కో దేవుడికి ఓ భక్తబృందం.. సంకర్షణునికి ఓ ప్రాంతంలో గొప్ప ఆరాధన. కృష్ణునికి మరో ప్రాంతంలో.. వాసుదేవునికి మరో రాజ్యంలో.. నారాయణునికి మరో చోట! ఇవన్నీ కలిపి భక్తి అయితే.. ఈ భక్తి ఎదుగుదలలో సాహిత్య, కళారూపాల ప్రభావం తీవ్రంగా ఉంది. మొత్తంగా భక్తి భావన సామాజిక దైనందినంలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. శైవ తీవ్రవాదులు, వైష్ణవ తీవ్రవాదులు ఉండొచ్చు. వాళ్లు పరస్పరం కొట్లాడుకోవచ్చు. కానీ, సాధారణ సమాజంలో ప్రశాంత జీవనపు ప్రాధాన్యం పెరిగింది మాత్రం భక్తి ప్రభావం వల్లనే. ఎదురొచ్చిన వారికి నమస్కరించడం, హత్తుకోవడం.. గుంపు ధోరణి తగ్గి వ్యక్తికి ప్రాధాన్యత పెరిగింది. పంచములు, నిమ్న వర్గాలవారి పట్ల ఏహ్యత తగ్గి ఉదాసీనత మిగిలింది.

అది పట్టుకున్నాడు జాయపుడు.

అసలు ఈ భక్తిభావన ఉద్యమంలా పైకి ఉబికింది దక్షిణావర్త రాజ్యాలలో అని తెలిసినప్పుడు జాయపుడు చాలా ఆశ్చర్యపోయాడు. వైష్ణవ పీఠాధిపతి చెప్పిన ఆళ్వారులే ఈ భక్తి కవులబృందం. వీళ్లు భక్తి గీతాలు, పాశురాలు రాసుకుని చిన్న ఏకతారో.. తంబూరో.. చిడతలో